## తీపికల్లు--గాంధిగారు—కృష్ణాపత్రిక

“తీపికల్లు పుష్టికర మని నమ్మువారు దానిని నిరభ్యంతరముగ త్రాగవచ్చు” నంటున్నది (౨౭-౮-౩౭) కృష్ణాపత్రిక.

వస్తుగుణం తెలసినవా రనేకు లున్నారు. ప్రసక్తి వచ్చినప్పుడు, వారు, ఫలానా వస్తువు చాలా మంచి దంటారు. అయితే: ఇక వారు దానిని వాడి తీరవలసిన దేనా? లేక, అలా చెప్పేవారు దానిని వాడేవారే అయివుంటా రని నిశ్చయం చేసెయ్యవలసిన దేనా?

మొగలాయీ పాదుపాల ప్రవృత్తిని మించిపోతున్న దిది.

తీపికల్లు పుష్టికరం అని యెవరో చెప్పారో, రాశారో సూటిగా అది కృష్ణాపత్రిక చెవినో, కంటనో పడినది. పిడుగుపడ్డట్టయిపోయింది; కాని గాంధిగారున్నూ అలాగే చెప్పారు. మాట్టాడ్డానికి వీలులేకపోయింది. అయితే, అక్కస్సు తీరలేదు. పైని చూపించిన మాట అనేసింది. అప్పటికి తృప్తి అయినది.

అనుకంపాజనక మైన అవస్థ యిది. మంచిచెడ్డలూ, సాధ్యాసాధ్యాలూ యేర్పరించుకునే శక్తిని చేతులారా చంపుకున్న వారికీ, విన్నన్ని చెప్పినదే వేద మని నమ్మే పరప్రత్యయనేయబుద్ధులకూ యిది సహజ మైన పరిణామం.

కాని, యిన్నాళ్లకి, గాంధిగారే తీపికల్లు అంటే యిష్టపడ్డప్పుడు, వారి అడుగుజాడలకోసం వెతుక్కునే కృష్ణాపత్రిక మాత్రం యిష్టపడక యేం చేస్తుందీ?

గాంధిగారు, చాలా కాలంనుంచే మద్యనిషేధాన్ని గురించి తీవ్రప్రచారం చేస్తున్నారు. ఆప్రచారం చేసేవారిలో, ప్రస్తుతం గాంధిగారికే ప్రాముఖ్యం యివ్వడానికి మా కేమీ ఆక్షేపణ లేదు కాని అది చూసినప్పుడల్లా “ఇలా చెయ్యడానికి వీరికి ప్రమాణం యేమిటీ? ఎందుకూ యీ వ్యర్థప్రయత్నాలూ?” అనిపిస్తూ వుంటుంది. నవ్వున్నూ వస్తుంది.

ఎంచేత నంటే?

ఎటుచూసినా, సృష్టి అంతా ద్వంద్వభూయిష్ఠంగా వున్నది. నవరణలు ప్రతిపాదించి, నెగ్గించి, అమల్లో పెట్టడం యెవరికీ సాధ్యం కాదు. అది అలా జరిగిపోవలసినదే. కొమ్ములు తిరిగినవారేనా దానికి దాసోహం అనవలసినదే.

వ్యభిచారం ప్రపంచం అంతటా వున్నది. వారు త్రికాలజ్ఞానసంపన్నులే కావచ్చును; కొందరు, కలిసి ఆలోచించి, స్త్రీపురుషులకు వివాహబంధం యేర్పరిచారు. వెంటనే వ్యభిచారం పుట్టింది. వివాహబంధం యేర్పరచడంవల్లనే అది పుట్టింది. వివాహబంధంలో కట్టుబాట్లు యెక్కువ అయినకొద్దీ అది బిగిసిపోయింది. వివాహబంధం వున్నంతకాలమూ అది వుంటుంది. ఇది తాతాచార్యులుగారి ముద్ర; కాని అది మంచి దని యెప్పుడూ యెవరూ చెప్పలేదు. చెప్పరు. వ్యభిచరించేవారున్నూ అది చెడ్డ దనే అంగీకరిస్తారు. అయితే మానరు. మానలేరు. అలా అని దాన్నెవరూ ప్రోత్సహించరు. ప్రోత్సహించలేరు. అది తిట్లు తింటూనూ వుంటుంది. లక్షణంగా జరుగుతూనూ వుంటుంది.

మద్యపానం యిలాంటి దేనా కాదు. దాన్ని, కొందరు నిషేధించారు. నిజమే; కాని మరికొందరు అది మనుష్యులకు విధి అన్నారు.

మద్యపానం ప్రపంచం అంతటా వున్నది. కర్మభూమి అనిపించుకునే మన దేశంలోనూ యెక్కువగానే వున్నది.

మన పురాణేతిహాసాలు అడుగడుక్కీ పానవర్ణనలతో గుబాళిస్తున్నాయి.

మన ఆలంకారికులూ, కవులూ మద్యపానం పూర్తిగా అంగీకరించడమే కాదు, విధిగా వుండా లన్నారు.

అయితే: ఇదంతా వీగాసాలకు మరిగినవారి ప్రలాపం అనవచ్చు; కాని, మనుష్యు డైన ప్రతీవాడికీ మద్యపానం అగత్య మైన దని—చేసితీరవలసిం దని ఆయుర్వేదం దృఢంగా విధిస్తున్నది.

మదాత్యయం అని వొక వ్యాధి. అది మద్యపానం వల్ల పుడుతుంది. చిత్రం యేమి టంటే? ఆవ్యాధి నిదానం చెబుతూనూ, చికిత్స చెబుతూనూ కూడా, ఆయుర్వేదం, మద్యపానం మానవద్దంటుంది.

మాధవకరుడు, తన మాధవనిదానంలో,

“విషంలో వున్న గుణాలే మద్యంలోనూ వున్నవి. మద్యాన్ని అతిగా పుచ్చుకుంటే మదాత్యయం అనే ఉగ్రవ్యాధి కలుగుతుంది. ౧. ఇంకే మంటే? స్వభావంవల్ల అన్నం యెలాంటిదో మద్యం అలాంటిది. అన్నం యుక్తియుక్తంగా—అంటే మోతాదుగా భుజిస్తే అమృతం అవుతుంది. మోతాదు దాటితే రోగం పుట్టిస్తుంది. అలాగే మద్యమున్నూ ౨. ప్రాణికోటికి అన్నమే ప్రాణం. అతిమాత్రంగా సేవిస్తే ఆ అన్నం ప్రాణాలు తీస్తుంది. విషం ప్రాణాలు తీస్తుంది. నిజమే; కాని మోతాదుగా సేవిస్తే ఆవిషం రసాయనం అయి ఆయువూ, బలమూ వృద్ధిచేస్తుంది ౩.” అని చెప్పాడు.

ఇలా చెప్పి అత నూరుకోలేదు.

“విధీ, మోతాదూ, కాలమూ అనుసరించి అన్నం భుజిస్తే యెలా బలం కలుగుతుందో, అలాగే, మద్యం కూడా, విధీ మోతాదూ కాలమూ అనుసరించి సేవిస్తే అమృతోపమానం అవుతుంది. ౪. స్నిగ్ధా లైన భక్ష్యమాంసాలతోనూ, నిర్దుష్టం అయిన అన్నంతోనూ మద్యపానం చేస్తే ఆయువూ, బలమూ, శరీరపుష్టీ కలుగుతాయి. ౫. మద్యం విధిప్రకారం పుచ్చుకుంటే శరీరసౌందర్యమూ, మనస్సంతోషమూ, తేజస్సూ, పరాక్రమమూ కలుగుతాయి. ౬.”

ఇక్కడ “స్నిగ్ధా లైన భక్ష్యమాంసాలతోనూ, నిర్దుష్టం అయిన అన్నంతోనూ మద్యపానం చేస్తే” అంటే చాలా అర్థం వున్నది. ఆహారం పుచ్చుకోకుండా మద్యం పుచ్చుకోగూడదు. పుచ్చుకుంటే శరీరం కృశించి, రోగాలు పుడతాయి. కనక భోజనం గాని, ఉపాహారం గాని అయిన తరవాతనే మద్యపానం చెయ్యాలి. అలా

చేస్తే అవి సరిగా జీర్ణం అయి పైని చెప్పిన లాభాలు కలుగుతాయి. యూరపియనులు యీవిధిప్రకారమే మద్యపానం చేస్తారని తెలుస్తున్నది. వెనక, వొకమాటు, ఎవరినను "తిన్న మాంసపుముద్దలు జీర్ణం కావడానికే ఆంగ్లేయులు మద్యపానం చేస్తా" రని చెప్పాడు. దీనికనుగుణంగానే "అనూపజాంగలమాంసాలు యథావిధిగానే వంటచెయ్యబడినా మద్యం సహాయం లేనిదే యెలాగ జీర్ణం అవుతాయీ?" అని వాగ్భటుడడుగుతున్నాడు.

అయితే: మద్యపానం చేస్తే మత్తు కలుగుతుంది. ఎంతమాత్రమూ సందేహం లేదు; కాని ఆమదానికి, మాధవకరుడు, నాలుగు దశలు చెప్పాడు. వాటికి ప్రథమమదం, ద్వితీయమదం, తృతీయమదం, చతుర్థమదం అని పేరు. ప్రథమమదలక్షణం ఏమిటంటే? "బుద్ధి వికసిస్తుంది. జ్ఞాపకశక్తి హెచ్చుతుంది. ప్రీతీ, సుఖమూ కలుగుతాయి. అన్నపాననిద్రలు ప్రీతిభాజనా లవుతాయి. చదివేటప్పుడూ, పాడేటప్పుడూ, స్వరానికి సారళ్యం కలుగుతుంది. అది (ప్రథమమదం) అతిరమ్యం అయినది."

రెండు, మూడు, నాలుగు మదాలు మంచివి కావు. చెరుపు చేస్తాయి. విధీ, మోతాదూ, కాలమూ గుర్తించి మద్యం సేవిస్తే ప్రథమమదం మాత్రమే కలుగుతుంది. అది కోరతగ్గదే. వెనక, వొకమాటు, మద్యపానానికి సంబంధించిన చర్చవచ్చినప్పుడు మద్రాసు కౌన్సిలులో యెక్జిక్యూటివు కౌన్సిలు మెంబరు (పేరు జ్ఞాపకం లేదు. యూరపియను) మితపానం సౌఖ్యకరం అని చెప్పాడు. అది ఆయుర్వేదసిద్ధాంతానికి అనుగుణంగానే వున్నది *

అయితే: గాంధిగారు. మద్యాన్ని తీపికల్లనీ, పుల్లకల్లనీ విడదీస్తున్నారు. తీపికల్లు అంటేనే వారు ఇష్టపడుతున్నారు. పుల్లకల్లు నిషా కలిగిస్తుందని దృఢంగా నిరసిస్తున్నారు.

కాని ఆయుర్వేదం చూస్తే యిది భ్రాంతిమూలంగా కనపడుతుంది. తీపీ, పులుపూ అని విభేదం చెయ్యకుండా మద్యపానాన్నే ఇంతవరకూ తాము పూర్తిగా నిషేధిస్తూ వుండినారు కనక, నిజం తెలిశాక మద్యనిషేధప్రచారం వదులుకుంటే బాగుండదు కనక, వారు ఈయెత్తు యెత్తారనికూడా తోస్తున్నది.

ఏమంటే? "మద్యంలో మధురాది షడ్రసాలూ వున్నాయి; కాని అమ్ల (పులుపు) రసం ప్రధానమైనది. అమ్లరసము కల వస్తువులన్నిటికీ మద్యం మొదటిది" అని ఆయుర్వేదసిద్ధాంతం.

ఇంతకీ: "మద్రాసుప్రభుత్వమువారు ప్రస్తుతము ఒక సేలము జిల్లాలో మాత్రము మద్యవిక్రయనిషేధమునకు పూనుకొనినారు. మహాత్ముడు సూచించినటుల మూడు సంవత్సరములలో గాకపోయినను, అయిదు సంవత్సరముల కైనను మద్యనిషేధమునకు రాష్ట్రవ్యాప్తి సిద్ధించితీరు" నంటున్నదే కృష్ణాపత్రిక? "తీపికల్లు పుష్టికర మని నమ్మువారు దానిని నిరభ్యంతరముగ త్రాగవచ్చు" నన్నే దానికి దీనికి సమన్వయం యెలాగా?

తమ వియ్యంకుల నమ్మకా న్ననుసరించి, రాజగోపాలాచారిగారు, సేలంజిల్లాలో తీపికల్లును నిషేధించడం మానతారా? వారు, సేలంజిల్లాలో ప్రవేశపెట్టబోయే కార్యక్రమంలో యీవిభేదం చూపించారా? గాంధిగారు తీపికల్లు విషయంలో చూపించే ఆనుకూల్యానికి అతివ్యాప్తి రాకుండా వుంటుందని కృష్ణాపత్రిక నమ్ముతున్నదా?

## సాంబమూర్తిగారిని నెపపెట్టడాని క్కాదూ?

"ఆంధ్రరాష్ట్రము నేడు జరూరుగా కావలసియున్నది........ ప్రత్యేకాంధ్రరాష్ట్రము నేర్పాటు చేసేయెడల ఖర్చులు తగులుబడి యగునని ఇన్నాళ్లకు ౧౯౩౮ సం. రంలో బాధించే యెడల ఆవాదమునకు మనము చెవి యొగ్గజాలము. ఈ రాష్ట్రవిషయమై కాలయాపన చెయ్యక వీలైనంత త్వరలో శాసనసభ్యులు ఆలోచింపవలెను."

ఇది డాక్టరు పట్టాభిసీతారామయ్యగారి ప్రకటన.

ఆంధ్రరాష్ట్రం కావాలని పట్టాభిసీతారామయ్యగారికి, నిజంగా, యింత ఆవేదన వున్నదా? ఉంటే యెప్పణ్ణుంచీ?

ఆదికాలంలో, వారు, ఆంధ్రోద్యమంలో పని చెయ్యడమూ, ఆంధ్రరాష్ట్రం కావాలని తీవ్రప్రచారమే చెయ్యడమూ యెరుగుదుము; కాని తరవాత, వారు కాంగ్రెస్సుముంపులో పడిపోయారు. అతిపిలో, వారికి, కాంగ్రెస్సు వ్యూహం దగ్గిర ఆంధ్రోద్యమమూ, సంపూర్ణస్వరాజ్యం యెదట ఆంధ్రరాష్ట్రమూ చంటిపిల్లల వుబలాటంగానూ నికృష్టంగానూ, అవమానకరంగానూ కనపడ్డాయి.

అడుగు మోపడానికి కాంగ్రెస్సుగుడారంలో కసింత చోటు దొరికింది మొదలు ఇప్పటిదాకా వారి యీదృష్టి మారిందను కోడానికి కెలాంటి సన్నివేశాలూ తటస్థించలేదు.

అలాంటివారిప్పుడిలాంటి ప్రకటన చెయ్యడం —ఇది చూసి దేశంలో యెంతో మంది పొంగిపోతున్నారు. అయితే: సాంబమూర్తిగారు, ప్రెసిడెన్సీకాలేజీలో అర్థం లేని ఆవుపన్యాసం చేసి వుండకపోతే డాక్టరుగారీప్రకటన చేసి వుందురా? ఇది సాంబమూర్తిగారిని నెపపెట్టడానిక్కాదని రుజువుచెయ్యగలరా?

కాకపోతేనే మేము చాలా సంతోషిస్తాము. అయితే; డాక్టరుగారు అంతటితో వూరుకుంటే పనికిరాదు. వారు ఆంధ్రరాష్ట్రాన్ని గురించి ప్రజలలో ఆందోళన లేవనెత్తాలి. రాయలసీమ వ్యాప్తిని నిర్ణయించడం కాదు, ఆసీమవారిని కష్టసుఖాలు చెప్పి కూడగట్టుకురావాలి. ప్రభుత్వంతో, రాయబారాలు చేసి సాఫల్యం కలిగించాలి.

డాక్టరుగారి శక్తి యెవరూ యెరుగనిది కాదు. ఇంతేకాదింత కంటే యెక్కువ పనులే వారు నిర్వహించగలరు.

అయితే: ఇందులో వొక చిక్కున్నది. అది డాక్టరుగారికి బాగా తెలుసు. ఏమిటంటే! సంపూర్ణస్వరాజ్యోద్యమమూ, ఆంధ్రరాష్ట్రో

---

* మద్యపానాన్ని, చరకశుశ్రుతవాగ్భటాలు, ఇంతకంటే దృఢంగా విధిస్తున్నాయి. అవి వచ్చే సంచికలో సాకల్యంగా ప్రకటిస్తాము.

సంపాదకుడు.